క్లుప్తంగా

నియామకం



ఉత్తర్వులు అందుకుంటున్న ప్రభాకర్

గంగాధర: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన కోల ప్రభాకర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం నియమించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మధురానగర్‌లోని ప్రజా కార్యాలయంలో శుక్రవారం ప్రభాకర్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం కృషి చేస్తానన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని మానేరు వాగు నుంచి విలాసాగర్ గ్రామానికి చెందిన గరిగంటి బాలరాజు, డ్రైవర్ మల్లయ్య ధర్మారం రోడ్డులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వీణవంక: వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాహెబ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ చేరారు. మండల కేంద్రంలో పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని ప్రణవ్ అన్నారు. కార్యక్రమంలో మొలుగూరి సదయ్య, పైడి కుమార్, సజ్జు, రాజేశం, కుమారస్వామి, రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పలకలు

చొప్పదండి: మండలంలోని రాగంపేట గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు స్థానిక ఆలయ పూజారి డింగరి శ్రీనివాస్, జ్యోతి దంపతులు కుమారుడు సత్యనారాయణ జన్మదినం పురస్కరించుకొని ఎలక్ట్రానిక్ పలకలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దంపతులను అభినందించారు. దాతలు ఏటా అంగన్‌వాడీ కేంద్రానికి అనేక వస్తువులు సమకూర్చడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బొడ్ల సరోజన, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన రాజు ఇటీవల మృతి చెందగా అతిథి డెవలపర్స్ అధినేత కొమ్మిడి రాకేశ్‌రెడ్డి అనుచరుల ద్వారా శుక్రవారం యాభై కిలోల బియ్యం మృతుడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో యువసైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు సతీశ్, ప్రశాంత్, కర్ణాకర్, శ్రావణ్, అనిల్, గడ్డం కుమార్, ఎలవేని శ్యాంసుందర్, సోయల్, జావిద్, ఈదునూరి అనిల్, హరీశ్ తదితరులు ఉన్నారు.

యుద్ధభేరి సదస్సును విజయవంతం చేయండి

మానకొండూర్: కరీంనగర్ పార్లమెంట్ స్థాయి యుద్ధభేరి సదస్సును విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు బోనగిరి ప్రభాకర్ పార్టీ అభిమానులు, కార్యకర్తలను కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. కరీంనగర్ పద్మానగర్‌లోని దాసరి విజయ గార్డెన్‌లో 7న ఉదయం 11 గంటలకు సదస్సు నిర్వహిస్తామని, కార్యక్రమానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బోయినపల్లి వినోద్‌కుమార్, హాజరవుతున్నారని పేర్కొన్నారు. అల్గునూర్ నుంచి భారీ ర్యాలీ ఉంటుందని, నియోజకవర్గ వ్యాప్తంగా ఆర్ఎస్పీ అభిమానులు, అన్ని కులసంఘాల నాయకులు, లౌకిక వాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఓటుహక్కుపై అవగాహన



సైకిల్ యాత్రచేస్తున్న పిడిశెట్టి రాజు

గంగాధర: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తూ కొహెడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం గంగాధరకు చేరుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచే ఓటుహక్కుపై అవగాహన కల్పించడానికి సైకిల్ యాత్ర ప్రారంభించానని తెలిపాడు. 18 సంవత్సరాలు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ప్రతి ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరాడు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళి

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో సంఘసంస్కర్త, దివంగత ఉపప్రధాని, బడుగు, బలహీనుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. మానకొండూర్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆయన విగ్రహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. జమ్మికుంట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనుపమ నివాళి అర్పించారు ఇల్లందకుంటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. బడుగుబలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి ప్రణాళికలు అమలు చేశారని గుర్తు చేశారు. సైదాపూర్‌లో మహనీయుల ఉత్సవ కమిటీ నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. హుజూరాబాద్‌లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు నివాళులర్పించారు.



మానకొండూర్: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



జమ్మికుంట: నివాళి అర్పిస్తున్న జమ్మికుంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది



రామడుగు: గోపాల్‌రావుపేటలో నివాళి అర్పిస్తున్న యువజన సంఘం నాయకులు



శంకరపట్నం: నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ అనుపమ, సిబ్బంది



ఇల్లందకుంట: బాబుజగ్జీవన్‌రామ్‌కు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



హుజూరాబాద్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకుల నివాళి

'హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం'



జమ్మికుంట: రైతు దీక్షలో బీజేపీ నాయకులు



మానకొండూర్: లక్ష్మీపూర్‌లో..

ఇల్లందకుంట: రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రంలో శుక్రవారం నాయకులతో కలిసి రైతు దీక్ష నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా రుణమాఫీ అమలుకాలేదని, క్వింటాల్‌కు రూ. 500 ఇవ్వాలని, ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

జమ్మికుంట: రైతులకు పంట పరిహారం అందించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో రైతు దీక్ష చేపట్టారు.

గన్నేరువరం: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతుదీక్ష చేపట్టారు.

శంకరపట్నం: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రైతుదీక్ష చేపట్టారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.చివరి ఆయకట్టుకు నీరందించి రైతులను ఆదుకోవాలన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని లక్ష్మీపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ ఆధ్వర్యంలో రైతుదీక్ష చేపట్టారు.

వీణవంక: హామీలను నెరవేర్చాలని కోరుతూ మండలంలోని చల్లూరు గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి ఇంటి వద్ద రైతు దీక్ష చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు.

రైతు దీక్షను విజయవంతం చేయాలి

మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో హుజూరాబాద్‌లో శనివారం రైతుదీక్ష చేపట్టనున్నట్లు ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి తెలిపారు. పార్టీ కార్యకర్తలు, రైతులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హుజూరాబాద్ : రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు కోరారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న దగ్ధం

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనంటూ రైతు ఆవేదన

సైదాపూర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండెకరాల్లోని మొక్కజొన్న శుక్రవారం దగ్ధమైందని రైతు తాడూరి రాజుకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గొడిశాల శివారులో చేతికందిన మొక్కజొన్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. రాజుకుమార్ అతని భార్య, పక్కనున్న రైతులు మంటలు ఆర్పారు. లేదంటే ఇతర రైతుల పంటచేన్లు మంటలకు ఆహుతయ్యేవి.కాగా ఇటీవల రాజుకుమార్ వ్యవసాయ భూమిలో విద్యుత్ అధికారులు 11 కేవీ లైన్ మరమ్మతులు చేశారు. కనెక్షన్ సరిగా ఇవ్వకపోవడంతో రెండు వైర్ల మధ్య నిప్పురవ్వలు చెలరేగి పంట కాలిపోయిందని రైతులు తెలిపారు. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని రైతు బోరున విలపించాడు. విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ చింత లతకుమార్ డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ జయంతోత్సవ కమిటీ



స్వీట్లు తినిపించుకుంటున్న అంబేడ్కర్ జయంతి ఉత్సవ నూతన కమిటీ సభ్యులు

హుజూరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక శుక్రవారం మాజీ అధ్యక్షుడు ఎర్ర శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా బండ శ్రీనివాస్, బొరగల సారయ్య, కమిటీ చైర్మన్‌గా ఎండీ ఖలీద్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా మంద భిక్షపతి, గొట్టె జమదగ్ని, రొంటాల రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇల్లందుల సమ్మయ్య, కార్యదర్శులుగా రావుల రాజేశ్, ఎర్ర రాజ్‌కుమార్, తూర్పాటి రాజు, దేవనూరి రవీందర్, కోశాధికారిగా ఇప్పలపల్లి చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శిగా తులసి లక్ష్మణామూర్తి, బొడ్డు సంజీవ్, అంగిడి సాయిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు, శ్రీనివాస్, తునికి వసంత్, ఎర్రబోజు నారాయణ, రుద్రారపు రామచంద్రం, ఎర్ర రాజకుమార్, బొడ్డు సంజీవ్, ఎర్ర రమేశ్, తునికి సమ్మయ్య ఉన్నారు.

నిబంధనలు పాటించకుంటే జరిమానా

శంకరపట్నం: నిబంధనలు పాటించకుంటే జరిమానా విధిస్తామని కేశవపట్నం జీపీ సిబ్బంది శుక్రవారం ప్రచారం చేశారు. మండల కేంద్రంలో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతి సిబ్బంది రోడ్డు మధ్య నుంచి 50 ఫీట్ల దూరంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని ప్రచారం నిర్వహించారు.



ప్రచారం చేస్తున్న జీపీ సిబ్బంది

తాగునీటి సమస్య పరిష్కారానికి విద్యుత్ మోటారు బిగింపు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కొల్లూరిపల్లి, ముకుందరెడ్డికాలనీలో తాగునీటి సమస్య ఏర్పడింది. ప్రజలు ఇబ్బంది పడుతుండగా సమస్య పరిష్కారానికి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి (ఎంపీవో) రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం విద్యుత్ మోటారును పంచాయతీ సిబ్బందితో బిగించి కాలనీవాసులకు తాగునీటిని అందించారు.



విద్యుత్ మోటారు బిగిస్తున్న సిబ్బంది

అమ్మవారికి మకరతోరణం, కిరీటం బహూకరణ



అమ్మవారికి కిరీటం, మకరతోరణం బహూకరిస్తున్న దాతలు

హుజూరాబాద్: పట్టణంలోని పోచమ్మతల్లి ఆలయంలోని అమ్మవారికి శుక్రవారం దాత పంజాల జ్యోతికళాధర్ మకరతోరణం, కిరీటం బహూకరించి భక్తి చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ భూమి చంటి, వైస్ చైర్మన్, గౌరవ అధ్యక్షులు, తదితరులు ఉన్నారు.



చలివేంద్రాలు ఏర్పాటు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామం ఎస్‌బీఐ బ్యాంక్ ఆవరణలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో, తోకలపల్లి గ్రామంలో దాతలు గుజ్జ సరిత శ్రీనివాస్‌రెడ్డి,అంబాల కుమారస్వామి చలివేంద్రాలు ఏర్పాటు చేయగా శుక్రవారం ప్రారంభించారు. దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏరియా కోఆర్డినేటర్స్ ఖాజాబీ, లీలావతి, రజిత, మండల ఆర్ఎంపీ, పీఎంపీల అధ్యక్షుడు పంజాల తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లో శుక్రవారం మాజీ సీఎం కేసీ ఆర్ పొలంబాట నేపథ్యంలో నిరసన తెలిపేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులను రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్ కు తరలించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు విడిచిపెట్టారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు తిరుపతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, ప్రశాంత్‌రెడ్డి, నారాయణగౌడ్, తదితరులున్నారు.

జిల్లాకు చేరిన రాజ్యాంగ రక్షణ యాత్ర

సప్తగిరికాలనీ: రాజ్యాంగ రక్షణ యాత్ర శుక్రవారం జిల్లాకు చేరింది. ఉదయం కోర్టు చౌరస్తా వద్ద జిల్లా మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం మూల స్తంభాలుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని తెలిపారు. అది నచ్చని కొన్ని మనువాద, మతతత్వ పార్టీలు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు గెలిపిస్తే రాజ్యాంగాన్నే మారుస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తే తాము మిమ్మల్నే మార్చేస్తామని హెచ్చరించారు. మాలలు అప్రమత్తంగా ఉండి, ఇలాంటి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, కార్యదర్శి గూడ కనకయ్య, ప్రచార కార్యదర్శి తాళ్ల వెంకటేశ్, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, రాష్ట్ర నాయకుడు దామెర సత్యం, 22వ డివిజన్ కార్పొరేటర్ గంట కల్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



జమ్మికుంట: ఇఫ్తార్ విందులో నాయకులు, ముస్లింలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి మసీదులో రంజాన్ పురస్కరించుకొని మున్సిపల్ చైర్మన్ దేశిని స్వప్నకోటి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని ప్రజలు కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలరు రాధాన దానందం, స్వరూప శ్రీహరి, పిట్టల శ్వేత రమేష్, మాజీ ఉప సర్పంచ్ దేశిని శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, ఉడుత వెంకటేష్, రామచంద్రం,శ్రీను ,సంకీస సురేష్, రాజ్‌కుమార్, షరీఫ్, సునీల్ పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామం మసీద్‌లో రెడ్డి సంక్షేమ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు రూపిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు మాజీ కోఆప్షన్ సభ్యుడు ముస్తఫా, షరీఫ్, సమ్మక్క మాజీ చైర్మన్ రూపిరెడ్డి రాజిరెడ్డి, సామాజిక కార్యకర్త టీచర్ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలి

మానకొండూర్: మానకొండూరు మండలం ముంజంపల్లి, మద్దికుంట, కొండపల్కల, గంగిపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి రామానుజచార్యులు ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. క్లస్టర్ ఆఫీసర్ కరణ్ కుమార్, సంఘ కార్యదర్శి లక్ష్మారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామనుజాచార్యులు